
సాక్షి ఒడిశా

బుధవారం । 6 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,24,988లు, వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రజల మనిషి సీఎం నవీన్ పట్నాయక్

రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రజల మనిషి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు.

- 8లో.



ఘనంగా బిజూ పట్నాయక్ జయంతి

రాష్ట్రవ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

- 8లో.

న్యూస్‌రీల్

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంభం



కౌంటర్ పునః ప్రారంభిస్తున్న దృశ్యం

కొరాపుట్: ఎట్టకేలకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు బస్టాండ్‌లో ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో కౌంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. గతంలో ఇదే ప్రాంతంలో కేంద్రం ఉండేది. కానీ రైల్వే ఉన్నతాధికారులు అనాలోచిత చర్య వలన 10 నెలల క్రితం ఎత్తివేశారు. దీంతో జిల్లా ప్రజలు, వర్తకులు, రాజకీయ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి చెలరేగింది. దీనిపై బీజేడీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి స్వయంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు పలుమార్లు లేఖలు రాశారు. బీజేపీకి చెందిన మాజీ ఎంపీ బలబధ్ర మజ్జి ఈ సమస్యను విన్నవించారు. చివరకు బీజేపీకి చెందిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో స్వయంగా న్యూఢిల్లీలో మంత్రి అశ్వినిని కలిసి లేఖ అందజేశారు. దీంతో అధికారులు స్పందించి పునః ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బలభద్ర మజ్జి, బీజేపీ నాయకుడు గౌరి శంకర్ మజ్జిలు పాల్గొన్నారు.

'ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధమవ్వాలి'



మాట్లాడుతున్న సుమంత ప్రధాన్

జయపురం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధమవ్వాలని కొరాపుట్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుమంత ప్రధాన్ పిలుపునిచ్చారు. జయపురం నియోజకవర్గంలో బీజేపీ ఎన్నికల కార్యాలయం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో బీజేపీ చేపడుతున్న సంక్షేమ, ప్రగతి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో గోవింద జెన, జయపురం ప్రభారి చిత్త ప్రధాన్, బీజేపీ జాతీయ ఆదివాసీ ఉపాధ్యక్షుడు కాళీరాం మఝి, రాయగడ ప్రభారి శివ శంకర ఉల్క, రాష్ట్ర బీజేపీ కార్యనిర్వాహక శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్, జిల్లా బీజేపీ సాధారణ కార్యదర్శి చంద్రశేఖర రథ్, కార్యదర్శి బైద్యనాథ్ మిశ్ర, జిల్లా మీడియా ప్రభారి మీనకేతన దాస్, హిమాంశు మహాపాత్రో, రమేష్ చంద్ర మిశ్ర, రాష్ట్ర బీజేపీ కృషక్ మోర్చ ఉపాధ్యక్షుడు బిపద భజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

'బ్రాహ్మణ కుటుంబాల ప్రగతికి కృషి'



సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ పెద్దలు

జయపురం: నిరుపేద బ్రాహ్మణ కుటుంబాల ఆర్థిక ప్రగతికి కృషి చేయాలని జయపురం బ్రాహ్మణ వికాస పరిషత్ నిర్ణయించింది. స్థానిక మెయిన్ రోడ్డులోని బంకమఠంలో బ్రాహ్మణ వికాస పరిషత్ అధ్యక్షుడు శరత్ మిశ్ర అధ్యక్షతన సమాజ్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సాంప్రదాయ కుటుంబాల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా నిరుపేద బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను సమీక్షించారు. జిల్లాలో అనేక బ్రాహ్మణ సాంప్రదాయ కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని, అటువంటి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. బ్రాహ్మణ నిరుద్యోగ యువతలో స్కిల్ డవలప్‌మెంట్ చేసి ఎదిగేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు గోపీనాథ్ త్రిపాఠీ, సాధారణ కార్యదర్శి త్రిలోచన భట్, సదాశివ మిశ్ర, సూర్యనారాయణ పండ, కిశోర్ చంద్ర పరిచ, లీగల్ అడ్వైజర్, న్యాయవాది జి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల ముప్పు లేదు

- రాష్ట్రంలో ప్రశాంతంగానే ఎన్నికలు
- రెండేళ్లుగా అవాంఛనీయ సంఘటనలు కట్టడి
- బీఎస్‌ఎఫ్ డీఐజీ ధీరేంద్ర కుమార్



భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మావోయిస్టుల నుంచి ఎలాంటి ముప్పు లేదని సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) డీఐజీ ధీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. సోమవారం కటక్ పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు పురస్కరించుకుని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ జరిగే అవకాశం లేదన్నారు. మల్కన్‌గిరి జిల్లా స్వాభిమాన్ ఏరియాతో సహా ఇప్పటివరకు మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా భద్రతా దళాన్ని సన్నద్ధం చేసినట్లు తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2022 పంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఈసారి జరగనున్న ఎన్నికలను అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించేందుకు బీఎస్‌ఎఫ్ సన్నద్ధమైందన్నారు.

వ్యూహాత్మక కార్యాచరణతో ముందుకు

శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు నివారించడానికి కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్) సమన్వయంతో వ్యూహాత్మక కార్యాచరణతో కొనసాగుతున్నట్లు ధీరేంద్ర కుమార్ తెలిపారు. వామపక్ష తీవ్రవాదుల నుంచి ఎలాంటి ఆటంకాలు ఎదురైనా ఎదుర్కొనేందుకు తాము వ్యూహం రచించామని స్పష్టం చేశారు. భద్రతా బలగాల అనుకూల చర్యలు, స్థిరమైన ఆపరేషన్ల కారణంగా మావోయిస్టులు అలజడి తగ్గిందన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎలాంటి అంతరాయాలకు పాల్పడే సాహసం చేయరని దీమా వ్యక్తం చేశారు.

2010 నుంచి పరిస్థితుల్లో మార్పు

2010 అక్టోబర్‌లో మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగ్‌పూర్‌లలో బీఎస్‌ఎఫ్ బలగాలను మోహరించింది. ఈ ప్రాంతాలన్నీ ఇప్పుడు చాలా వరకు నక్సల్ రహితంగా ఉన్నాయి. కొరాపుట్ మావోయిస్టుల నుంచి పూర్తిగా విముక్తి పొందింది. ఒకప్పుడు నిషేధిత సంస్థకు కేంద్రంగా ఉన్న స్వాభిమాన్ ఏరియాలో కూడా మావోలను పూర్తిగా నిర్మూలిస్తామని డీఐజీ దీరేంద్ర కుమార్ తెలిపారు. మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో స్థావరాలు విడిచి పొరుగు సరిహద్దు ప్రాంతాలకు తరలిపోతున్నారన్నారు. దీంతో రాష్ట్రంలో వీరి ఉనికి క్రమంగా బలహీనపడుతోందని పేర్కొన్నారు. ఒకటి, రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో మావోయిస్టుల నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుందన్నారు.

35 కంపెనీల బలగాలు మోహరింపు

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభకు జరగనున్న ఏకకాల ఎన్నికల కోసం ఒడిశాలో దాదాపు 100 మంది సిబ్బందితో కూడిన 35 కంపెనీల సరిహద్దు రక్షణ దళం (బీఎస్‌ఎఫ్)ని మోహరించనున్నట్లు డీఐజీ వెల్లడించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు మావోయిస్టు కార్యకలాపాలతో ప్రభావితమైన ప్రాంతాలతో సహా పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ బలగాలను మోహరించనున్నట్లు వివరించారు. గతంలో 2014, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు, తదుపరి 2022లో జరిగిన పంచాయతీ ఎన్నికలను ఉటంకిస్తూ, తాజా ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా విజయవంతం చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలను సులభతరం చేసేందుకు రాష్ట్రంలో బీఎస్‌ఎఫ్‌తో సహా మొత్తం 75 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సీఏపీఎఫ్) మోహరించనున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇటీవల ప్రకటించింది. 2010 నుంచి రాష్ట్రంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో బీఎస్‌ఎఫ్ సుదీర్ఘ ప్రమేయాన్ని డీఐజీ వివరించారు. ఈ దిశలో గణనీయ పురోగతి సాధించామని ఆయన తెలియజేశారు. గత 14 ఏళ్లలో 65 మంది మావోయిస్టులు హతమయ్యారు. 793 మందిని అరెస్టు చేశారు. 632 మంది లొంగిపోయారు. రాష్ట్రంలో 496 ఇంప్రూవైజ్డ్ పేలుడు పరికరాలను (ఐఈడీ) స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండేళ్లలో మావో రహిత రాష్ట్రం

రానున్న రెండేళ్లలో మావోరహితం రాష్ట్రంగా ఒడిశా నిలుస్తుందని బీఎస్‌ఎఫ్ డీఐజీ వెల్లడించారు. మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల్లో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ ప్రాంతాల్లో ఇటీవల పెద్ద సంఘటనలు నమోదు కాలేదని పేర్కొన్నారు. దీంతో సరిహద్దు కందమాల్, బౌధ్, కలహండి జిల్లాల్లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలపై బీఎస్‌ఎఫ్ దృష్టి సారించిందని తెలిపారు. ప్రస్తుతం ఒడిశాలోని రెండు మూడు జిల్లాలకే మావోయిస్టుల ఉనికి పరిమితమైందని స్పష్టం చేశారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రాన్ని నక్సలు రహితంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

అతివలకే అందలం..!

- అధికార బీజేడీలో మహిళలకు పెద్దపీట



కౌసల్య ప్రధాని



నవీన గొండో



కౌసల్య హిక్కాక



ఇందిరా నందో

కొరాపుట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికార బీజేడీ అతివలకే అధికంగా టిక్కెట్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే పార్టీ శ్రేణులకు సంకేతాలు పంపింది. దీంతో కొరాపుట్, నబరంగ్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ప్రతిపాదిత అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళలు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వీరిలో నబరంగ్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని సతీమణి కౌసల్య ప్రధాని ఉన్నట్లు పార్టీ సీనియర్ నాయకులు పరోక్షంగా సూచనలు చేశారు. దీంతో ఆమెను అభ్యర్థిగా గుర్తించి పార్టీ కార్యకర్తలు సంసిద్ధమయ్యారు. అదేవిధంగా ఉమ్మర్‌కోట్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్ గొండో సతీమణి నవీన గొండో పేరు దాదాపు ఖాయమైనట్లే తెలుస్తోంది. ఈ స్థానం నుంచి సుభాష్ రెండుసార్లు విజయం, రెండు సార్లు ఓటమి చవిచూసారు. వరుసగా రెండుసార్లు ఓడిపోయిన ఆయనకి ఈ విడత మొండిచెయ్యి చూపారు. కానీ బలమైన అభ్యర్థిగా ఉన్న గుర్తింపు ఉండడంతో ఆయన సతీమణికి టికెట్టు ఇస్తున్నారు. ఈ నేపధ్యంలో నవీనకి టిక్కెట్టు విషయంలో అధిష్టానం స్పష్టమైన సంకేతం ఇచ్చింది. దీంతో ఆమె ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నవీన ప్రస్తుతం రాయిఘర్ సమితి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అలాగే కొరాపుట్ లోక్‌సభ అభ్యర్థిగా కౌసల్య హిక్కాక పేరు దాదాపు ఖరారైనట్లే. గత సార్వత్రిక ఎన్నికల్లో కౌలస్య హిక్కాక కేవలం 3,300 ఓట్ల తేడాతో ఓడిపోయారు. దీంతో ఆమెకే మరోసారి అవకాశం ఇస్తున్నారు. కౌసల్య హిక్కాక భర్త జిన్ను హిక్కాక గతంలో కొరాపుట్ ఎంపీగా, లక్ష్మీపూర్ ఎమ్మెల్యేగా గెలిపొందారు. ప్రస్తుతం కొరాపుట్ జిల్లా బీజేడీ పార్టీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఇకపోతే కొరాపుట్ లోక్‌సభ పరిధిలోని జయపూర్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి రబి నారాయణ నందో సతీమణి ఇందిరా నందో పేరు దాదాపు ఖాయం చేసినట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో రబినందో వరుసగా ముడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపొంది మరో రెండుసార్లు వరుసగా ఓడిపోయారు. ఇక్కడ బలమైన ప్రత్యర్థిగా కాంగ్రెస్‌కి చెందిన తారాప్రసాద్ బాహిణీపతి కొనసాగుతున్నారు. తారాని ఢీకొట్టే సామర్థ్యం కేవలం నందో కుటుంబానికే ఉందనే నమ్మకంతో ఆ కుటుంబం నుంచి ఆమెకు టిక్కెట్టు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇందిరా గతంలో కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షురాలిగా రెండుసార్లు గెలిపొందారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం మహిళలకు బీజేడీ టిక్కెట్లు కేటాయించే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రమాద స్థలంలో సుశాంత్ మృతదేహం

జయపురం: తమ బందువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి తిరిగివస్తున్న ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి బొయిపరిగుడ-కుంధ్రల మధ్యనున్న మంగిడిగుడ-నటనీకుండ అడవి సమీపంలో చోటుచేసుకుంది. మరణించిన యువకుడు బొయిపరిగుడ సమితి లింబగుడ గ్రామానికి చెందిన సుశాంత బెహర(28)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుశాంత బెహర కుంధ్ర సమితి బాగ్దేరి గ్రామ పంచాయతీ బాగ్దేరి గ్రామానికి బంధువుల పెళ్లికి వెళ్లాడు. అనంతరం అతడు బైక్‌పై తమ గ్రామానికి మంగిడిగుడ-నటనీకుండ అడవి మార్గంలో వస్తుండగా ఒక మలుపు వద్ద బైక్ అదుపు తప్పి గోతిలో పడింది. ప్రమాదంలో ఘటన స్థలంలోనే సుశాంత్ మరణించాడు. విషయం తెలిసిన బంధువులు కుంధ్రా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి బైక్ కింద చిక్కుకున్న సుశాంత మృతదేహాన్ని స్వాధీన పరచుకొని, కుంధ్ర కమ్యూనిటీ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సుశాంత్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఏడేళ్ల తర్వాత ఉపశమనం



నిర్దోషులుగా విడుదలైన నిరంజన్, మహంకుడోలు

జయపురం: మావోయిస్టులకు పేలుడు సామగ్రి అందజేస్తున్నారనే ఆరోపణతో జయపురం గౌడవీధికి చెందిన మున్సిపల్ ఉద్యోగి దుర్యోధి మహంకుడొ, జయపురం సమితి తెలియ గ్రామానికి చెందిన నిరంజన్ దాస్‌లను 7 ఏళ్ల క్రితం చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పోలీసులు అరెస్టు చేశారు. అయితే వారు నిర్దోషులని చత్తీస్‌గఢ్ రాష్ట్ర దిగంబగిరి న్యాయస్థానం తీర్పునిస్తూ మంగళవారం విడుదల చేసింది. కేసు వివరాలను పరిశీలిస్తే.. నిరంజన్ దాస్, మహంకుడోలు ఒక స్కూటర్‌పై కొశాహండి సమీప నువాగాంలో ఉండగా 2016 జూలై 28వ తేదీన చత్తీస్‌గఢ్ పోలీసులు సాధారణ దుస్తుల్లో నాలుగు వాహనాల్లో వచ్చి స్థానిక పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లిపోయారు. దీంతో అది చూసిన నువాగాం ప్రజలు ఎవరినో ఎత్తుకుపోతున్నారని కోట్‌పాడ్ పోలీసులకు తెలియజేశారు. కోట్‌పాడ్ పోలీసులకు కన్నుగప్పి మూడు వాహనాలు తప్పించుకున్నాయి. అయితే ఒక పోలీసు వాహనం రైల్వే గేటు వద్ద పోలీసులకు చిక్కడంతో విషయం తెలిసింది. అనంతరం చత్తీస్‌గఢ్ పోలీసులు నగరి పోలీసుస్టేషన్‌లో నిందితులు మావోయిస్టులకు పేలుడు సామగ్రి సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచారు. ఈ కేసుని సుదీర్ఘ కాలం విచారించిన దబంగిరి న్యాయస్థానం నిందితులు నిర్దోషులని తీర్పునిచ్చింది. దీంతో మహంకుడొ, నిరంజన్ దాస్‌లు జైలు నుంచి విడుదలయ్యారు.

మల్కన్‌గిరిలో వీకే పాండియన్ పర్యటన



మ్యాజిక్ కార్డులను ఆవిష్కరిస్తున్న వీకే పాండియన్

మల్కన్‌గిరి: జిల్లాలో 5టీ అధ్యక్షుడు వీకే పాండియన్ మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా నువ ఓ ఒడిశా పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వర్చువల్ విధానంలో సీఎం నవీన్ పట్నాయక్ పాల్గొన్నారు. గిరిజన యువత అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. ఒడిశా రాష్ట్రంలో కొత్త ఒడిశా మ్యాజిక్ కార్డ్‌ల నమోదును ప్రారంభించారు. ఈ కార్డుల ద్వారా విద్యార్థులు బస్సు, రైలు, విమానాల్లో రాయితీ పొందవచ్చని తెలియజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



హరికథ చెబుతున్న కళాకారులు

బరంపురం: స్థానిక డైమండ్ ట్యాంక్ రోడ్డులో గత మూడు రోజులుగా జరుగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామివారి 54వ వార్షిక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా తెలుగు కళా సాంస్కృతిక సంస్థలు చేపట్టిన భరతనాట్యం, కూచిపూడి నత్యాలు ఎంతగానో అకట్టుకుంటున్నాయి. అలాగే సోమవారం రాత్రి నిర్వహించిన హరికథ గానం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీజేడీలోకి చేరికలు



నెక్కంటితో బీజేడీలో చేరిన హరిజన వీధి ప్రజలు



సుధీర్ దాస్ సమక్షంలో బీజేడీలో చేరిన సుమిత్ర

రాయగడ: స్థానిక హరిజన వీధికి చెందిన వందలాది మంది మహిళలు, యువకులు బీజేపీ నుంచి బీజేడీలో చేరారు. స్థానిక రాణిగుడ ఫారంలోని బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కర రావు స్వగృహంలో మంగళవారం వీరంతా బీజేడీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. వారిని నెక్కంటి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో సుస్థిర పాలనతో పాటు ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ ఆశయాలకు ప్రభావితమై పార్టీలో చేరుతున్నారన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మునిగుడలో...

అదేవిధంగా మునిగుడ సమితి పరిధిలోని బైరవగుడ సమితి సభ్యురాలు సుమిత్రా బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్ సమక్షంలో బీజేడీలో చేరారు. ఆమె కాంగ్రెస్ పార్టీ తరుపున గత పంచాయతీ ఎన్నికల్లో బైరవగుడ సమితి సభ్యురాలిగా విజయం సాధించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆశయాలు, సిద్ధాంతాలకు తాను ప్రభావితమై కాంగ్రెస్ పార్టీని వీడి బీజేడీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

ఉత్తమ పంచాయతీగా హలువ



బిడికను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాయగడ: సదరు సమితి పరిధి హలువ గ్రామం రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా నిలిచిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్‌సమావేశ మందిరంలో గ్రామ సర్పంచ్ తమ్మారావు బిడికకు కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత చైర్‌పర్సన్ సరస్వతి మాఝి తదితరులు అవార్డు అందించారు. అలాగే ఆయనను సన్మానించి రూ.1.50 లక్షల చెక్కును జిల్లా యంత్రాంగం అందించింది. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కృషిని కొనియాడారు.

రైల్వే అండర్ పాసేజ్ నిర్మించాలని ఆందోళన



రైల్ రోకో నిర్వహిస్తున్న గిరిజనులు

కొరాపుట్: కొరాపుట్ నుంచి అరకు వెళ్లే మార్గంలో త్యాడిపుట్ వద్ద రైల్వే అండర్ పాసేజ్ నిర్మాణం చేపట్టాలని బొడొసుక్కు గ్రామ పంచాయతీకి చెందిన 4 గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. తమకు రెండు అండర్ పాసేజ్ వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉందని రైల్ రోకో నిర్వహించారు. ముందస్తు హెచ్చరిక లేకుండా ప్రజలు పట్టాలెక్కడంతో రైల్వే అధికారులు కంగారుపడ్డారు. కొరాపుట్ నుంచి సుక్కు వరకు సుమారు 11 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి రైల్వే వంతెన గానీ, అండర్ పాసేజ్ గానీ లేవు. దీంతో గిరిజనులు పట్టాలు దాటేటప్పుడు ప్రమాదాలు బారినపడుతున్నారు. సమీప పంట పొలాలు, అటవీ ఉత్పతుల సేకరణకి వెళ్లినప్పుడు పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో కనీసం తమకు చిన్నదైనా అండర్ పాసేజ్ నిర్మించాలని నినాదాలు చేశారు. సుమారు 4 గంటల పాటు జరిగిన ఈ రైల్ రోకోతో ఆ మార్గంలో అధికారులు రైళ్లు నిలిపివేశారు. జిల్లా అధికార యంత్రాంగం, రైల్వే అధికారులు వచ్చి గిరిజనులతో చర్చలు జరిపారు. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిర్దిష్ట గడువులో రైల్వేశాఖ నిర్మాణం ప్రారంభించకపోతే మరోసారి ఆందోళనకు దిగుతామని హెచ్చరించి ఆందోళన విరమించారు. ఆందోళనలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్, ఎంపీ ప్రతినిధి రుపక్ తురుక్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కర్మాగారంపై దాడులు



కర్మాగారంలో దాడులు చేస్తున్న పోలీసులు



సీజ్ చేసిన యంత్రాలు



సీజ్ చేసిన కారంపొడి, పసుపు ప్యాకెట్లు

బరంపురం: నగరంలోని పాణిగ్రాహిపెంట వీధిలో గత కొద్ది రోజులుగా వివిధ కంపెనీల పేరుతో నకిలీ వంట సామగ్రి తయారు చేస్తున్న కర్మాగారంపై బరంపురం పోలీసులు మంగళవారం దాడి చేశారు. దీనిలో భాగంగా లక్షలాది రూపాయులు విలువచేసే నకిలీ కారం, పసుపు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తయారీకి ఉపయోగిస్తున్న యంత్రాలను సీజ్ చేయడంతో పాటు నిందితుడు లింగా సాహుని అరెస్టు చేశారు. మరింత మంది నిందితులు కోసం గాలిస్తున్నామని ఏఎస్పీ ప్రభాష్ కుమార్ రౌథ్‌రాయ్ తెలియజేశారు.

క్లుప్తంగా

మునగపాకలో ప్రైవేటు ఉద్యోగి మృతి

మునగపాక (అనకాపల్లి జిల్లా): మండలంలోని నాగవరం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చమాకాండీ గ్రామానికి చెందిన స్వామినాథ పాండ(29) రాంబిల్లి మండలంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సొంత పనిపై విశాఖ వెళ్లి ద్విచక్ర వాహనంపై రాంబిల్లికి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో బైక్ అదుపు తప్పింది. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో అడిషనల్ డీజీ బన్సల్



బన్సల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైదరాబాద్ రీజియన్ సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అడిషనల్ డీజీ సిసిర్ బన్సల్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి సాందీప్ శర్మలు ఆలయ విశిష్టతను వివరించారు.

క్యారమ్స్ పోటీల్లో ఉద్దానం క్రీడాకారుల ప్రతిభ



రన్నరప్‌గా ట్రోఫీ అందుకుంటున్న ఢిల్లేశ్వరరావు

కవిటి: ఆంధ్రప్రదేశ్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్, రాష్ట్రస్థాయి ఓపెన్ క్యారమ్స్ టోర్నీలో కవిటి మండలం జగతి గ్రామానికి చెందిన లమ్మత హరిప్రియ, ప్రగడపుట్టుగకు చెందిన బార్ల ఢిల్లేశ్వరరావు ప్రతిభ కనబరిచారు. ఫైనల్స్ పోరులో స్వల్ప తేడాతో విశాఖపట్నం జిల్లా క్రీడాకారులతో ఓటమి చెంది రన్నరప్‌గా నిలిచారు. వీరు సాధించిన విజయం పట్ల రాష్ట్ర క్యారమ్స్‌సంఘం ఉపాధ్యక్షుడు పూడి నేతాజీ హర్షం వ్యక్తం చేశారు.

సారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు



దాడుల్లో పాల్గొన్న ఎస్ఈబీ అధికారులు

మందస: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషినల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం నాటుసారా తయారీ, అమ్మకాలపై దాడులు నిర్వహించారు. గిరిజన ప్రాంతమైన టబాగాం గ్రామ పొలిమేరల్లో నిర్వహించిన ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. చాపరాయిలో సారా అమ్ముతున్న సవర శ్రీనాథ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సారా రవాణాకు వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం ఇంటెలిజెన్స్ వింగ్ సీఐ కూర్మారావు, పలాస డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రకుమార్, ఎస్ఈబీ సోంపేట ఎస్ఐ వై.చంద్రమోహన్, వైవీకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి..మరొకరికి గాయాలు



అప్పారావు మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం ఆకుల రఘునాథపురం గ్రామానికి చెందిన నందిగాం అప్పారావు(42) మృతిచెందాడు. టెక్కలి సీఐ పి.హైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అప్పారావు టెక్కలి నుంచి నందిగాంవైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లచ్చన్నపేట సమీపంలో సంకెళ్లమెట్ట వద్ద మలుపు తిరిగే క్రమంలో అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టాడు. దీంతో అప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. తన ద్విచక్రవాహనం అదే వేగంతో వెళ్లి ముందున్న మరో బైకును ఢీకొట్టడంతో టెక్కలి చేరివీధికి చెందిన దండాసి పవన్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య భారతి, కుమారుడు రోహిత్, కుమార్తె శ్రావణి ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



కొరాపుట్: బిజూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రమేష్ తదితరులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేడీ కార్యకర్తలు



రాయగడ: కొండబాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



కొరాపుట్: బిజూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి తదితరులు

ఘనంగా బిజూ పట్నాయక్ జయంతి



భువనేశ్వర్: బిజూ పట్నాయక్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

రాష్ట్రవ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బిజూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బీజేడీ కార్యకర్తలు పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



మల్కన్‌గిరి: బిజూ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న బీజేడీ నాయకులు



బరంపురం: బిజూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేడీ నాయకులు, కార్యకర్తలు



మల్కన్‌గిరి: బీజేడీ కార్యాలయంలో రక్తదానం



జయపురం: సుభాష్ రౌత్ ఆధ్వర్యంలో ర్యాలీ



పర్లాకిమిడి: ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మాజీమంత్రి రబినారాయణ నందో



రాయగడ: బిజూ విగ్రహానికి నివాళులర్పించి ప్రమాణం చేస్తున్న నెక్కంటి ఇతర నాయకులు



పర్లాకిమిడి: గుమ్మాలో రక్తదాన శిబిరం



రాయగడ: గుణుపూర్‌లో బిజూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కొరాపుట్: పొట్టంగిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పీతం పాఢీ

ప్రజల మనిషి సీఎం నవీన్ పట్నాయక్



చండీఖోల్ వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం నవీన్ పట్నాయక్ తదితరులు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రజల మనిషి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. జాజ్‌పూర్ జిల్లా చండిఖోల్ వద్ద రూ.20,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌కు పీఎం నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒడిశా, దేశాభివృద్ధిలో బిజూ పట్నాయక్ చేసిన కృషి మరువలేనిదన్నారు. దేశ ప్రజలందరి తరఫున బిజూ బాబుకు నివాళులర్పిస్తున్నానని తెలియజేశారు. అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు సుమారు 2002 నుంచి దీర్ఘకాలంలో పెండింగ్‌లో ఉన్న పారాదీప్ రిఫైనరీ వంటి పలు భారీ ప్రాజెక్టులతో పాటు, తాజా ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా నిర్ధారిత కాల పరిమితిలో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. పెట్రోలియం, సహజ వాయువు, అణు ఇంధనం, రహదారులు, విస్తరణ, ఎల్‌పీజీ టెర్మినల్, గ్యాస్ పైప్‌లైన్, కొత్త రైళ్లు, అనేక ఇతర ప్రాజెక్టుల ప్రారంభంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఒడిశా అభివృద్ధిపై దృష్టి సారించినందుకు ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 1990లో బిజూ బాబు కళింగ నగర్‌ను పారిశ్రామిక హబ్‌గా మార్చాలని ఆలోచించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకొచ్చారు. నేడు కళింగ నగర్ దేశానికి ఉక్కు హబ్‌గా మారిందన్నారు. ఒడిశా మాత్రమే కాదు, దేశం మొత్తం దీనివల్ల ప్రయోజనం పొందుతోందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

రైల్వేలు మరియు కనెక్టివిటీ రంగాలలో మెగా డవలప్‌మెంట్ ప్రాజెక్టులు ఈ ప్రాంతంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయన్నారు.

ప్రధాన తయారీ కేంద్రంగా ఒడిశా

చండీఖోల్‌లో సీఎం నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ.. తూర్పు భారతదేశంలో ఒడిశా ప్రధాన తయారీ కేంద్రంగా మారబోతోందని తెలియజేశారు. ఒడిశాలో సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఒడిశా నేడు అగ్రస్థానంలో ఉందని తెలియజేశారు. మిషన్ శక్తి మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారేందుకు ముందుకొస్తున్నారని పేర్కొన్నారు. చండీఖోల్ – పారాదీప్ జాతీయ రహదారితో ఇతర ఎన్‌హెచ్‌ల

కొత్త రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం

చండిఖోల్ నుంచి భారత ప్రధానమంత్రి రూ.19,600 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో చమురు, గ్యాస్, రైల్వేలు, రోడ్లు, రవాణా, హైవేలు, అణుశక్తితో సహా పలు రంగాలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి 162 కిమీ బొంశొపాణి – దైతారీ – టొమ్కా – జఖాపురా డబుల్ రైలు మార్గం, ఖుర్దా రోడ్ – బారంగ్ 3వ రైలు మార్గాన్ని జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులు ధాతువు, ఖనిజాలను సమీప నౌకాశ్రయాలు మరియు ఉక్కు కర్మాగారాలు, దేశంలోని ఇతర ప్రాంతాలకు సమర్థవంతంగా రవాణాకు సౌకర్యం కల్పించి ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి గణనీయంగా తోడ్పడతాయి. దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యాన్ని పెంచే లక్ష్యంతో కళింగనగర్‌లో కాంకోర్ కంటైనర్ డిపోను ప్రారంభించారు. నౌర్గా వద్ద ఎలక్ట్రిక్ లోకో పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్, కంటాబంజీలో వ్యాగన్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్, బఘువాపాల్‌లో వ్యాగన్ మెయింటెనెన్స్ సదుపాయాలకు సైతం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పూరీ, ఆనంద్ విహార్ (న్యూఢిల్లీ) మధ్య కొత్త రైలును ప్రధానమంత్రి కెందుఝొరా రైల్వేస్టేషన్ నుంచి వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. అలాగే హరిదాస్‌పూర్, పారాదీప్ మధ్య మొదటి ప్యాసింజర్ రైలు సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, జలశక్తి శాఖ మంత్రి బిశ్వేశర్ టుడు తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్‌గా ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న పీఎం నరేంద్ర మోదీ

● గురుభ్యోనమః



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: మండలంలోని లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులంతా మంగళవారం ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ముందుగా జామెట్రీ బాక్సులు అందజేశారు. అనంతరం పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు, ప్రధానోపాధ్యాయుడు బి.వైకుంఠరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.ఎ.స్టాలిన్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వి.సూర్యప్రకాశ్, ఎం.శైలజ, సుభాషిని, హెచ్.అనురాధ, పి.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఇందుమతి, నీలకంఠేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ జి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కొబ్బరి సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

కంచిలి: కొబ్బరి సాగుకు యాజమాన్య పద్ధతులతోనే మనుగడ సాధ్యమవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త హరి కుమార్ అన్నారు. మంగళవారం మకరాంపురం పంచాయతీ పరిధిలో ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం సౌజన్యంతో కొబ్బరి సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కొబ్బరిలో రకాలు, ఎరువుల యాజమాన్యం, కొబ్బరిని ఆశించు పురుగు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సమాచార కేంద్రం సహాయ సంచాలకుడు వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, ఉద్యాన అధికారి పి.మాధవీలత, ఉద్యాన విస్తరణ అధికారి బాలరాజు, ఉద్యాన సహాయకులు శాంతమ్మ పాల్గొన్నారు.

మినీ మారథాన్



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ద్యుతిచంద్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని పాత మండయ్ గ్రౌండ్ నుంచి కొత్త మండయ్ గ్రౌండ్ వరకు సుమారు 6 కి.మీ మినీ మారథాన్ పోటీలను ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతర్జాతీయ క్రీడాకారిణి ద్యుతిచంద్ జెండాఊపి రన్ ప్రారంభించింది. సుమారు మూడు వేల మంది యువతీ యువకులు పోటీలో పాల్గొన్నారు. రాష్ట్ర స్వతంత్ర అభివృద్ధి మండలి ప్రతి మండలంలో ఇటువంటి కార్యక్రమాలను చేపడుతోంది. జిల్లాలో మూడు రోజులు పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వతంత్ర మండలి రాష్ట్ర సలహాదారుడు ప్రదీప్ మజ్జి మాట్లాడుతూ.. గిరిజన యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న యువత

ఐఐటీ క్యాంపస్‌లో పోలియో కార్యక్రమం



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) ఆధ్వర్యంలో పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. క్యాంపస్ సిబ్బంది పిల్లలతో పాటు ఈ ప్రాంగణంలో ఉంటున్న వలస కార్మికుల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. జట్నీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సహకారంతో 3 రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. క్యాంపస్ ప్రాంగణంలో సంజీవన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన మూడు రోజుల పోలియో చుక్కల డ్రైవ్‌లో 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 76 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. సంజీవన్ హెల్త్ సెంటర్, జట్నీ సీహెచ్‌సీ సభ్యులు క్యాంపస్ మరియు సమీప ప్రాంతాల నివాసితుల పిల్లలకు టీకాలు వేశారు.

ఈ సందర్భంగా ఐఐటీ భువనేశ్వర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మన్సూర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ అనేది పిల్లలకు అత్యంత ముఖ్యమైన టీకా ప్రదాన కార్యక్రమాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఐఐటీ భువనేశ్వర్ ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా రజక సంఘం చైర్మన్‌గా సన్యాసిరావు


మాట్లాడుతున్న అప్పికొండ సన్యాసిరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రజక సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా కమిటీ చైర్మన్‌గా అప్పికొండ సన్యాసిరావు ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా సన్యాసిరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ రజక జాతి అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషిచేస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సెక్రటరీ జంప చిన్న, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టిబాబు, సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు శీల తాతారావు, శ్రీను, చెల్లారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న తలపాగాతో శ్రీశైలం బయల్దేరిన భక్తులు


మల్లన్న తలపాగాతో భక్తులు

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని మల్లికార్జునకాలనీకి చెందిన శ్రీశైలం మల్లికార్జున స్వామి భక్తులు శివరాత్రి సందర్భంగా సమర్పించాల్సిన తలపాగాతో శ్రీశైలం బయలుదేరారు. ఈ మేరకు మంగళవారం ఆటోలో చీపురుపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడి నుంచి ట్రెన్‌లో శ్రీశైలం వెళ్లనున్నట్లు తలపాగా తయారీదారులైన చల్లా జయరాం, రమ, షన్ముఖరావు, పావని తెలిపారు. శ్రీశైలంలో రెండురోజుల పాటు శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటామన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష

విజయనగరం క్రైమ్/తెర్లాం: బాలికను అపహరించిన కేసులో ముద్దాయికి పోక్సో చట్టం ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 అపరాధ రుసుం విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెలువరించారు. ఈ మేరకు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన గొట్టివాడ ఈశ్వరరావు వెంటపడి ఇబ్బంది పెడుతూ, కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్లు బాలిక తండ్రి తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో 2021 మార్చి 13న ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు అప్పటి ఎస్సై సీహెచ్.నవీన్ పడాల్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో ప్రాసిక్యూషన్ ప్రారంభం నుంచి తెర్లాం ఎస్సై రమేష్ కుమార్ సకాలంలో సాక్షులు, ఆధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో స్పెషల్ జడ్జిఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించారు.

1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం


వేరుశనగ పంటను, పరికరాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

తెర్లాం: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) ఆధ్వర్యంలో 1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ చెప్పారు. ఈ మేరకు తెర్లాం మండలంలోని నందబలగ గ్రామంలో ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై అందజేసిన పరికరాలతోపాటు, రైతులు బిందు, తుంపర్ల సేద్యం ద్వారా సాగుచేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మంగళవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది రూ.6.87కోట్లతో బిందు, తుంపర్ల సేద్యం కింద సబ్సిడీపై పరికరాలు, ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నామని తెలిపారు. జిల్లాలో లక్ష్యంగా పెట్టుకున్న 1200 హెక్టార్లలో ఇంతవరకు 500హెక్టార్లలో వివిధ రకాల ఉద్యానవన పంటలు సాగుచేయడంతోపాటు, వాటికి అవసరమైన పరికరాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. బిందు, తుంపర్ల పద్ధతిలో రైతులు ఉద్యానవన పంటలు సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేయడంతోపాటు, పంటలు మంచి దిగుబడి వస్తాయని తెలియజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్, ఏపీఎంఐపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

సీతంపేట: జాతీయ, రాష్ట్ర స్థాయి హాకీ, వాలీబాల్ ఆర్చరీ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన 20 మంది క్రీడాకారులకు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం క్రీడా పరికరాలు అందజేశారు. క్రీడా పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, క్రీడాధికారులు పాల్గొన్నారు.

సైకిల్ దిగిపోయి..ఫ్యాన్ కిందకు

- వైఎస్సార్‌సీపీలో 125 టీడీపీ కుటుంబాల చేరిక
- యాదవ సంఘం నాయకుడు మన్యాల కృష్ణ నేతృత్వంలో పార్టీ తీర్థం
- కండువాలు వేసి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్, జెడ్పీ చైర్మన్, ఎంపీ


వైఎస్సార్‌సీపీలో చేరిన మన్యాల కృష్ణకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం: ప్రతిపక్ష టీడీపీకి జిల్లాలో కోలుకోలేని దెబ్బ తగలింది. గడిచిన రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్నా కనీస గుర్తింపు లభించకపోవడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 125 యాదవ కుటుంబాల వారు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, పట్టణ యాదవ సంఘం పల్ల అప్పలస్వామిల నేతృత్వంలో మంగళవారం నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ల సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందకీ ముగ్గురు ప్రజాప్రతినిధులు కండువాలు కప్పి ఆహ్వానించారు. భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరగడంతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యంత కీలకమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు అధిక సంఖ్యలో పార్టీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పాలకులు వెనుకబడిన సామాజిక వర్గాల ప్రజలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేస్తే..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సామాజిక సాధికారతే ధ్యేయంగా పాలన సాగిస్తోందని చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు తగిన గుర్తింపునిస్తూ రాజకీయంగా, సామాజికంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో నూతనంగా చేరికలు జరగడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు మెచ్చిన పాలనను అందిస్తున్న వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావడంలో యాదవ సంఘాల నాయకులు పని చేయాలని కోరారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ మాట్లాడుతూ దశాబ్దాలుగా టీడీపీలో ఉండి సేవలందించినా కేవలం తమను ఓటు బ్యాంక్‌లా వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీలోకి సామాజిక వర్గంలోని ఇతర పెద్దలతో కలిసి చర్చించి చేరినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం తామంతా శ్రమించి పని చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గదుల సత్యలత, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ సూర్యనారాయణరాజు, బమ్మిడి అప్పలస్వామి అధిక సంఖ్యలో యాదవ సంఘాల నాయకులు, యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొన్నారు.


పార్టీలో చేరేందుకు వచ్చిన యాదవ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు

నిరంతర శ్రమతోనే విజయం

- ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్


యండమూరి వీరేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు

విజయనగరం: నిరంతరం శ్రమించడం ద్వారానే జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్న తపన సాధ్యపడుతుందని ప్రముఖ రచయిత, మనస్తత్వవేత్త యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో నగర పాలక సంస్థ విద్యాకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి రూపొందించి నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యండమూరి పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధం అవాలో వివరించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి, పోటీ పరీక్షలను తట్టుకుని విజేతలుగా నిలవడానికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను పదోతరగతి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న సమయంలో ఇటువంటి కార్యక్రమాలు రూపొందించిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని అభినందించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, తాళ్లపూడి సంతోషి కుమారి, తొగరోతు సంధ్యారాణి, ఎంతఓలు రాజు, సత్యవతి, వివిధ డివిజన్ కార్పొరేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో బ్లడ్‌బ్యాంక్ ప్రారంభం


బ్లడ్‌బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని, , పట్టణ, గ్రామీణ ప్రాంత పేద ప్రజల కోసం ఉన్నతమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు రూ.90లక్షలతో నిర్మించిన బ్లడ్‌బ్యాంక్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని, గత 30ఏళ్ల కాలంలో ఏ ముఖ్యమంత్రీ ఇలాంటి కార్యక్రమాలను చేపట్టలేదన్నారు. చీపురుపల్లిలో నిర్మించిన బ్లడ్‌బ్యాంకులో 500 యూనిట్ల బ్లడ్‌ను నిల్వచేసుకునే కెపాసిటీ ఉండడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మంచి సేవా కార్యక్రమాల కోసం ముందుకు వస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్‌కు మంత్రి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి, డైరెక్టర్.పి.శరత్‌చంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు కేఆర్‌డీ.ప్రసాద్, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనువాసులు నాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీటీసీ గెరిడి రామదాసు, వార్డు మెంబర్ మీసాల రామునాయుడు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో హెచ్‌సీ ప్రతిభ


హెచ్‌సీ కృష్ణంనాయుడిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వి.కృష్ణంనాయుడు విశేష ప్రతిభ కనబరిచి మూడు బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపికను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక హెచ్‌సీ క్రీడా ప్రతిభను ప్రశంసిస్తూ మహారాష్ట్రలోని పూణెలో ఫిబ్రవరి 13 నుంచి 17 వరకూ జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో కృష్ణంనాయుడు విశేష ప్రతిభ కనబర్చారని ఎస్పీ చెప్పారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ఆయన క్రీడాస్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. ఈ మేరకు రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ కేకేవీ.విజయనాథ్, రూరల్ ఎస్సై ఆర్.వాసుదేవ్ తదితరులు అభినందించారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

కొత్తవలస: మండలంలోని కొత్తవలస–విజయనగరం రైల్వేలైన్‌లో తుమ్మికాపల్లి సమీపంలో గల ఫైర్‌స్టేషన్ వెనుకభాగంలో గల రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గమనించారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న ట్రాక్‌మన్ రైల్వేస్టేషన్ మాస్టర్‌కు తెలపగా..ఆయన సమాచారం మేరకు ఎస్సై రవివర్మ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఉండవచ్చని అనుమానించారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని ఎస్సై రవివర్మ తెలిపారు. మృతదేహాన్ని పూర్తిగా పురుగులు తినేయడంతో గుర్తు పట్టేందుకు అవకాశం కూడా లేకపోయింది. ఈ మేరకు వైద్యులతో ఘటనాస్థలంలోనే పోస్ట్‌మార్టం నిర్వహించి సమీపంలో గల చెరువు వద్ద ఖననం చేసినట్లు చెబుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ చెప్పారు.

జొన్నల మెషీన్ కింద పడి మహిళ మృతి


మృతి చెందిన మహిళ

బలిజిపేట: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన చిన్నమ్మి(43) పంటపొలంలో జొన్న కండెలు ఆడుతున్న మెషీన్ కింద ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటనపై మృతురాలి భర్త అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వి.శ్రీనివాసరావు కేసు నమోదుచేశారు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. తన అన్నయ్య రామారావు పొలంలో జొన్న కండెలను మెషీన్‌లో ఆడుతున్న పనికి చిన్నమ్మి వెళ్లింది. కొన్ని కండెలు మెషీన్ వెనుకభాగంలో పడిపోవడంతో తీసేందుకు వెళ్లిన ఆమెను ప్రమాదవశాత్తు మెషీన్ చక్రాలు లాగివేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

18 లీటర్ల సారా సీజ్

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లిలో సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 18 లీటర్ల సారా సీజ్ చేసినట్లు ఎస్సై భాస్కరరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో సారా అమ్ముతున్న విషయంపై అందిన సమాచారంమేరకు దాడిచేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నా రు. గ్రామాల్లో సారా అమ్మకాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి


మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పక్కన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- మంత్రి బొత్స సత్యనారాయణ

రామభద్రపురం: నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని కొట్టక్కి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి భర్త స్వర్గీయ అప్పికొండ శ్రీరాములునాయుడు పేరిట నిర్మించిన కల్యాణ మంటపాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారంతా శ్రీరాములునాయుడు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారన్నారు. అందుకే రాష్ట్రంలో రాజకీయాలకతీతంగా అన్ని రంగాలకు చెందిన ప్రతి కుటుంబానికి మేలు చేశారని చెప్పారు. భవిష్యత్‌లో మరింత సంక్షేమం, అభివృద్ధిని సాధించు కునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల నాయకుడు శంబంగి వేణుగోపాల నాయుడు, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, పార్టీ మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, ఎంపీటీసీ సామిరెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో అందరికీ సముచిత గౌరవం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, హైమావతి, నాయుడుబాబు తదితరులు

శృంగవరపుకోట: వైఎస్సార్సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కుతుందని, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఎస్‌కోటలోని తన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు పాదయాత్రలో తన వెంట వచ్చిన ప్రతి ఒక్కరినీ దృష్టిలో ఉంచుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పించారన్నారు. కొంత మంది అపోహలతో పార్టీని వీడారని, వ్యక్తులతో కాకుండా, పార్టీలతో రాజకీయాలు చేయాలని హితవు పలికారు. పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, మంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్ చిన్నశ్రీను వంటి బలమైన నాయకత్వం పార్టీకి ఉందని, తాను నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని, నియోజకవర్గంలో పార్టీని డిస్టర్బ్ చేయాలని కొందరు పార్టీని వీడారని, వ్యక్తిగత స్వార్థం కోసం టీడీపీలోకి వెళ్లి ఎమ్మెల్యేపై బుదర జల్లడం వారికి సరికాదన్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి పరిణామాలున్నా వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమని, జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత గౌరవం దక్కిందన్నారు.

మహా శివరాత్రికి 52 ప్రత్యేక బస్సులు

- డీపీటీఓ టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: మహాశివరాత్రి పర్వదినాన వివిధ పుణ్యక్షేత్రాల సందర్శనకు జిల్లా పరిధిలోని డిపోల నుంచి 52 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. స్థానిక డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం డిపో నుంచి గుంప సోమేశ్వరుని దేవాలయానికి ఏడు బస్సు సర్వీసులు, సాలూరు డిపో నుంచి పాదమ్మకొండ క్షేత్రానికి 25 బస్సులు, పాలకొండ డిపో నుంచి రాజాం, చీపురుపల్లికి ఆరు సర్వీసులు, రామతీర్థంలోని రామస్వామి క్షేత్రానికి 14 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. సాధారణ పల్లెవెలుగు చార్జీలతోనే ప్రయాణ సేవలు అందిస్తామని తెలిపారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుతర బాధ్యతకు వారధి

- తెలుగు అకాడమీ' ప్రశ్నల నిధి
- డీఎస్సీ పోస్టుల వారీగా ప్రిపరేషన్ పుస్తకాల విడుదల


డీఎస్సీ పోటీ పరీక్షలకు తెలుగు అకాడమీ రూపొందించిన పుస్తకాలు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల నియామక (డీఎస్సీ) ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సమయం తక్కువ ఉందని నిరుత్సాహపడే వారికి నిరుద్యోగులకు ధైర్యాన్నిచ్చే దిశగా తెలుగు సంస్కృత అకాడమీ బృహత్తర కార్యక్రమం చేపట్టింది. అభ్యర్థుల విజయానికి తోడ్పడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించగల క్వశ్చన్ బ్యాంక్‌కు రూపకల్పన చేసింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిష్ణాతులైన ఉపాధ్యాయ ఉద్యోగులు, డైట్ కళాశాల అధ్యాపక, ప్రిన్సిపాల్స్‌ను ఎంపిక చేసి వారితో టీచర్ పోస్టుల వారీగా డీఎస్సీ పోటీ పరీక్షలకు ఉపయోగపడే ప్రశ్నల సమాహారం (క్వశ్చన్ బ్యాంక్) పుస్తకాలను తయారు చేసింది. ఆ పుస్తకాలను ఇటీవల తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎన్.లక్ష్మీపార్వతి, డైరెక్టర్ వి.రామకృష్ణ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పుస్తక విక్రయ దుకాణాల్లో అందుబాటులో ఉంచారు.

పుస్తకాల రూపకల్పనలో జిల్లావాసులు

తెలుగు సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పుస్తక రచన, పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన పలువురిలో విజయనగరం జిల్లా వాసులు ఉన్నారు. జిల్లాలోని డైట్ కళాశాల గణిత విభాగాధిపతి డాక్టర్ నల్ల తిరుపతినాయుడు గణితం సబ్జెక్టుకు, డైట్ కళాశాల సీనియర్ ఇంగ్లిష్ ఫ్యాకల్టీ జీజీఎస్ నాగేశ్వరరావు సబ్జెక్టుకు ఎడిటర్స్‌గా వ్యవహరించారు. డైట్ కళాశాల గణిత అధ్యాపకుడు వీవీజే సుబ్రహ్మణ్యం, అలుగోలు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జీఎస్‌కాంతారావు గణిత శాస్త్ర బిట్స్ పుస్తకాలకు, గుర్ల మండలం వల్లాపురం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎ.ప్రవీణ్‌కుమార్, విజయనగరం మండలం చెల్లూరు ఎంపీయూపీ స్కూల్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ టీచర్ బి.మోహనరావు సాంఘిక శాస్త్రం బిట్స్‌కు రచయితలుగా పనిచేశారు.


మెథడాలజీపై ఎక్కువగా బిట్స్



ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్ష రాసేవాళ్లకు ఈ పుస్తకాల్లో కచ్చితమైన ప్రిపరేషన్ విధానాన్ని వివరించాం. గ్రామర్ నుంచి యథావిధంగా గత డీఎస్సీ పరీక్ష పత్రాల్లాగానే వస్తాయి. వాటితో పాటు మెథడాలజీలో వచ్చే కఠినమైన ప్రశ్నలు కూడా ఈ పుస్తకాల్లో జోడించాం. సంక్షిప్తంగా ఇచ్చినప్పటికీ మంచి మార్కులు తెచ్చుకోవడానికి ఉపయోగపడతాయి.

జీజీఎస్‌నాగేశ్వరరావు,
జిల్లా డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు


కొత్త సిలబస్ నుంచి పాత మోడల్ పరీక్షల ప్రశ్నలు



నూతన సిలబస్‌లోని ప్రతి అంశం నుంచి కీలక భావాలను ఈ పుస్తకాల్లో క్రోడీకరించాం. పాత డీఎస్సీ మోడల్ ప్రశ్నపత్రాలను పరిగణనలోకి తీసుకుని కొత్త సిలబస్ నుంచి సేకరించిన కఠిన ప్రశ్నలను తీసుకున్నాం. పాఠ్యపుస్తకాల్లో నేర్చుకున్న అంశాలు ఎంతవరకు అవగాహన అయ్యాయో తెలుసుకోవడానికి బాగా ఉపయోగపడతాయి.

డాక్టర్ నల్ల తిరుపతినాయుడు,
డైట్ కళాశాల గణిత విభాగాధిపతి

ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి అని రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ కల్కూర అన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం పార్వతీపురం శాఖ పాత్యాంశాలలో 'ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత' అనే అంశంపై వాసవీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముఖ వ్యవసాయమని, రైతు ప్రతీ ఒక్కరికీ తిండి పెడుతున్నాడని, సమాజంలో వారిదే కీలక స్థానమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమాతను కాపాడటమే కాకుండా సమస్త జీవకోటిన రక్షించుకోగలమని అన్నారు. యువత వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని కోరారు. పాడి పంట సమాజానికి అవసరమని చెప్పారు. విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని, అది అలవాటు కావాలని ఆయన సూచించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రకృతి వ్యవసాయంపై గొప్ప సేవలు అందించారన్నారు. ప్రపంచ విజ్ఞానం తెలుసుకోవాలనే జిజ్ఞాస విద్యార్థులకు ఉండాలని కోరారు. పత్రికలు చదవాల్సిన అవసరం ఉందని, గొప్ప స్థాయికి చేరేందుకు ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీజీ కృష్ణాజీ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి టి.శివకేశవరావు, ఉపాధ్యక్షుడు డా.డి.పారినాయుడు, వాసవీ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ పీవీకే మణికుమార్, గ్రంథాలయ సంఘం జిల్లా కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు, ఉపాధ్యక్షుడు బడే సత్యనారాయణ, కన్సల్టెంట్ తుంబలి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.